భార్యను కొట్టిన భర్తకు జైలు

ఏడు రోజుల శిక్ష విధించిన కోర్టు

బంజారాహిల్స్, నవంబర్ 26: తరచూ భార్యను కొట్టడంతోపాటు పిల్లలను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తికి ఏడురోజుల జైలుశిక్ష పడింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 12 భోళానగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ ఖాదర్(49)కు భార్య షాహీన్ బేగంతోపాటు ఐదుగురు పిల్లలున్నారు. ఈనెల 24న సాయంత్రం తాగి వచ్చిన ఖాదర్ భార్యను కొట్టడంతోపాటు కుమార్తెను తీవ్రపదజాలంతో దూషించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని 10వ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. కేసు విచారించిన న్యాయమూర్తి తరచూ నిందితుడికి ఏడురోజుల జైలుశిక్ష విధించారు.

కార్తిక భోజనాలతో కార్మికులకు ఒరిగేదేంటి?

యాజమాన్యంపై టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): 'కార్తిక వనభోజనాలతో కార్మికులకు ఒరిగేదెంటి? ఒక్కరోజు భోజనం పెట్టి ఏడాదంతా సంతోషంగా ఉండమంటారా? యూనియన్ల స్థానంలో ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డుల ద్వారా సాధించిందేంటి? కనీసం ఒక్క సమస్యకైనా పరిష్కారం చూపారా? ఇంకెంత కాలం ఇలా మభ్యపెడుతారు..' అంటూ టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. మంగళవారం జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, యాదగిరి ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ యాజమాన్యం రోజురోజుకూ కార్మికులపై పనిభారం పెంచి శ్రమదోపిడీ చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కలిసి వచ్చే వారితో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించిన వారికే 'రెరా' అనుమతి

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): కొత్తగా ఇండ్లు నిర్మించి విక్రయించే రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్రాజెక్టును రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) వద్ద రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో అడ్డదారులు తొక్కుతున్నారు. సరైన పత్రాలు లేకుండా అమ్మకాలు జరుపుతుండడంతో మోసానికి గురవుతున్న కొనుగోలుదారులు ఇటీవలి కాలంలో భారీ సంఖ్యలో రెరాకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెరా చైర్మన్ ఎన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్లు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సెక్రటరీ తదితర అధికారులు మంగళవారం ఓ సమావేశం నిర్వహించారు. తమ వద్ద ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ కోసం చేసిన దరఖాస్తులలో సరైన పత్రాలు లేవని వారు డిఫాల్టర్ దరఖాస్తుదారులకు తెలిపారు. గడువులోపు అవసరమైన పత్రాలు అందించకపోతే, వారికి అనుమతించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అనుమతి ఇవ్వకపోయినా కొందరు తమ అనుమతి ఉన్నట్టు బ్రోచర్లలో, ప్రీ లాంచ్ కార్యక్రమాల్లో ప్రచారం చేసుకుంటున్నారని, వారిపై చర్యలు తప్పవని రెరా అధికారులు హెచ్చరించారు.

విజయోత్సవాల్లో నిలదీతలు

- హామీలు ఏమయ్యాయని గ్రామస్తుల ఆగ్రహం
- వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు నిరసనసెగ

బషీరాబాద్, నవంబర్ 26 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పనుల జాతరలో ప్రజలు సమస్యలపై ఏకరువు పెట్టారు. మంగళవారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల పరిధిలోని మంతట్టి గ్రామంలో గ్రామీణాభివృద్ధిశాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరై వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడుతుండగా ప్రజలు పలు సమస్యలపై ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు పింఛన్‌లు, మహిళలకు రూ. 2500, రుణ మాఫీ, రైతు బంధుకు దిక్కు లేదన్నారు. హామీలు నెరవేర్చకుండా విజయోత్సవాల పేరిట హడావుడి ఎందుకని ప్రశ్నించారు. మా యాతన పట్టించుకోకుండా.. జాతరలు ఎందుకు నిలదీశారు. దీంతో ఓ నాయకుడు మాట్లాడుతూ మీరు ఇలా చేస్తే మీకు ఏమి రావు, వేరే గ్రామానికి వెళ్లిపోతాయని బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో ప్రజల్లో ఆగ్రహం పెరిగింది. దీంతో పోలీసులు బలవంతంగా ప్రశ్నిస్తున్నవారిని బయటకు తరలించారు. కాంగ్రెస్ నేతల వైఖరి, పోలీసుల ధోరణిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

నిర్మల్-బైంసా జాతీయ రహదారిపై భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న మహిళలు

ఇథనాల్ మంటలు

మొదటిపేజీ తరువాయి...

అడ్డుకున్నారు. కలెక్టర్ వచ్చి లిఖితపూర్వంగా హామీ ఇచ్చేదాకా ఇక్కడి నుంచి వెళ్లేది లేదని భీష్మించుక్కూర్చోవడంతో చేసేదేంలేక తిరిగి వెళ్తున్న ఆర్డీవోను మహిళలు చుట్టుముట్టారు. దాదాపు ఆరు గంటలకుపైగా ఆమెను వాహనంలోనే నిర్బంధించారు. చివరికి పోలీసులు బలగాలతో వచ్చి ఆర్డీవోను తీసుకెళ్లగా కోపం కట్టలు తెంచుకున్న రైతులు అక్కడే ఉన్న ఆమె వాహనాన్ని ధ్వంసం చేసి నిప్పుపెట్టారు.

12గంటలు ఆందోళన

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల మధ్య ఇథనాల్ పరిశ్రమను నిర్మించవద్దని నాలుగు వేల మంది రైతులు, యువకులు, మహిళలు, ప్రజలు ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్మల్-బైంసా జాతీయ రహదారి-61పై బైఠాయించి ఆందోళన కొనసాగించారు. విషయం తెలియడంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్ నుంచి కూడా దాదాపు 500 మందికి పైగా పోలీసులు భారీ ధర్నా ప్రదేశానికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి పరిశ్రమను తరలిస్తామని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని రైతుల పట్టుబట్టారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు శ్రమించి ఇతర మార్గాల ద్వారా కొన్ని వాహనాలను తరలించారు.

కేసులు పెడతామని పోలీసులు భయపెడుతున్నరు

పరిశ్రమ వద్దని శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే.. పోలీసులు తమపై కేసులు పెట్టి భయాందోళనలు సృష్టిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పరిశ్రమ కోసం జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పిన కలెక్టర్, మూడు నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ వద్దకు కలెక్టర్ అభిలాష అభినవ్ వచ్చి పరిశ్రమను తరలిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'ఎన్నికలప్పుడే మేం గుర్తొస్తం.. ఎనిమిది నెలల నుంచి ఆందోళన చేస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు' అని మండిపడ్డారు. గతంలో కలెక్టర్ కార్యాలయానికి పిలిచి తమకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని, తమను కలెక్టర్ అవమాన పరిచారని, కలెక్టర్ వచ్చి పరిశ్రమను తరలిస్తామని లిఖిత పూర్వకంగా రాసిస్తే తప్ప ధర్నా విరమించేది లేదని తేల్చిచెప్పారు. ఎముకలు కొరికే తీవ్రమైన చలిలో కూడా పిల్లాపాపలతో రైతులు రోడ్డుపైనే వంట చేసుకొని చలి మంటలు కాగుతూ నిరసన తెలుపుతున్నారు. కాగా నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఇక్కడే ఉండి శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు. జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సమయంలో 108 అంబులెన్స్‌లు రావడంతో మానవతా దృక్పథంతో దారిచ్చారు. 'మా నాయకులు కనిపించడం లేదు' అని మహిళలు ఫ్లెక్సీలు పట్టుకొని నిరసన తెలిపారు.

ఆగ్రహంతో ఆర్డీవో రత్నకల్యాణి వాహనాన్ని కింద పడేసి ధ్వంసం చేసిన రైతులు

ఆరు గంటల పాటు ఆర్డీవో నిర్బంధం

రైతులకు నచ్చజెప్పాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మల్ ఆర్డీవో రత్న కల్యాణి ధర్నా ప్రదేశానికి సాయంత్రం 4 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగా 'ఇథనాల్ పరిశ్రమ వద్దు.. పచ్చని పొలాలు ముద్దు' అని నినాదాలు చేశారు. కలెక్టర్ రావాలని పట్టుబట్టడంతో చేసేదేం లేక వెనుదిరుగుతున్న సమయంలో ఆమె వాహనాన్ని అడ్డుకొని మహిళలు చుట్టుముట్టారు. ఆర్డీవో దాదాపు ఆరు గంటలకుపైగా వాహనంలోనే ఉండిపోయారు. బయటకు వెళ్లొస్తానని చెప్పినా మహిళలు వినిపించుకోలేదు. పోలీసులు కూడా చాలాసార్లు తీసుకెళ్తేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. దాదాపు రాత్రి పది గంటల ప్రాంతంలో నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల భారీ పోలీసు బందోబస్తుతో ఆర్డీవోను వేరే వాహనంలో నిర్మల్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన రైతులు ఆర్డీవో ఇక్కడే వదిలేసిన వాహనాన్ని కింద పడేసి దహనం చేశారు.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిఫారసు లేఖలు పరిగణించండి

- సిద్దిపేటలో ఆలయ నిర్మాణం ప్రారంభించండి
- టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడితో హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనం కోసం తెలంగాణ భక్తులు తీసుకొచ్చే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడును మాజీమంత్రి హరీశ్‌రావు కోరారు. బీఆర్ నాయుడు మంగళవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. హరీశ్ ఆయనకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం మీడియా రంగంలో ఉన్న బీఆర్ నాయుడికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని పేర్కొన్నారు. సిద్దిపేటలో నిర్మించ తలపెట్టిన టీటీడీ ఆలయ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. బీఆర్ నాయుడు మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న టీటీడీ ఆలయ పనులను పూర్తిచేసేందుకు బోర్డులో చర్చిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవడంపై ప్రభుత్వంతో మాట్లాడి, బోర్డులో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఏసీబీ వలలో అవినీతి అధికారులు

లంచం డిమాండ్ చేసి పట్టుబడిన ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 26: విద్యుత్ వైర్లను పాత పోల్ నుంచి కొత్త పోల్‌కు మార్చేందుకు లంచం డిమాండ్ చేసిన ఘట్‌కేసర్ ఏఈ, లైన్ ఇన్స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్న ఘటన ఘట్‌కేసర్‌లో జరిగింది. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండల విద్యుత్ కార్యాలయంలో ఏఈ(ఆపరేషన్)గా బలరాం నాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్‌గా హేమంత్ నాయక్ పని చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి తన ఇంటి సమీపంలోని 11 కేవీ వైర్‌ను పాత పోల్ నుంచి కొత్త పోల్‌కు మార్చడంతో పాటు సైడ్ ఆర్మ్‌ను మరో పోల్‌కు ఇన్‌స్టాల్ చేయడానికి ఆశ్రయించాడు. అధికారికంగా ఆమోదించేందుకు అధికారులు లంచం డిమాండ్ చేశారు. ఏఈ బలరాం నాయక్ రూ.10 వేలు డిమాండ్ చేయగా, లైన్ ఇన్‌స్పెక్టర్ బీ హేమంత్ నాయక్ రూ.5వేలను యంనంపేట్‌కు చెందిన మధ్యవర్తి బీ మహేశ్ ద్వారా డిమాండ్ చేశారు. రూ.15వేలను మంగళవారం అందజేయగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పిర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతాపూర్‌లో ఏఈ ఇంటి వద్ద ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఏసీబీకి పట్టుబడిన బలరాం నాయక్, హేమంత్ నాయక్, మహేశ్

తులం బంగారం ఎప్పుడిస్తారు?

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో వైరా ఎమ్మెల్యేను ప్రశ్నించిన మహిళ

కొణిజర్ల, నవంబర్ 26: 'కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం కూడా ఇస్తామన్నారు కదా? ఎప్పుడిస్తారు?' అంటూ వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఓ మహిళ ప్రశ్నించిన పరిణామం ఖమ్మం జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ హాజరై లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ లబ్ధిదారురాలి బంధువైన స్థానిక మహిళ చింతల నారాయణమ్మ 'మీరు అధికారంలోకి వస్తే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు తులం బంగారంఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు కదా? మరి ఎప్పుడు అందజేస్తారు?' అంటూ ప్రశ్నించింది. దీంతో ఒక్కసారిగా కంగుతున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు.. వెంటనే సదరు మహిళను వారించారు. ఎమ్మెల్యే బదులిస్తూ.. 'ప్రస్తుతం లోటు బడ్జెట్ ఉన్న నేపథ్యంలో బడ్జెట్‌ను అధిగమిస్తూ సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని అన్నారు. మొదటి ప్రాధాన్యంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని, త్వరలోనే తులం బంగారం ఇచ్చే విషయమై ప్రభుత్వం ఆలోచిస్తోందని సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళ

కిరాయి ఇస్తారా.. చావమంటారా?

- 20 నెలలుగా అమరచింత ఎంపీడీవో ఆఫీసు అద్దె బకాయి
- పెట్రోల్‌తో వచ్చి కార్యాలయానికి తాళం వేసిన యజమాని

వనపర్తి (నమస్తేతెలంగాణ)/అమరచింత, నవంబర్ 26 : ' 20 నెలలుగా ఇంటి కిరాయి డబ్బులు అడిగివేసారాను.. చివరకు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటాను' అని యజమాని హల్‌చల్ చేసిన ఘటన మంగళవారం వనపర్తి జిల్లాలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా అమరచింత మండల పరిషత్ కార్యాలయాన్ని మహంకాళి సురేందర్ ఇంట్లో కిరాయికి తీసుకొని నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం నెలకు రూ. 14,600 అద్దె చెల్లించేందుకు అగ్రిమెంట్ రాసుకున్నారు. 20 నెలలుగా కిరాయి ఇవ్వడం లేదు. మూడు నెలల క్రితం 10 నెలల కిరాయికి సంబంధించి రూ.లక్షా 45వేల చెక్కు ఇచ్చారు. దీనిని ఆత్మకూరు ఎస్టీవోలో ఇవ్వగా, వెయిటింగ్ ఫర్ గవర్నమెంట్ అప్రూవల్ అని ఆన్‌లైన్‌లో చూయిస్తున్నది. దీంతో కిరాయి ఇవ్వకుంటే ఆత్మహత్యకు చేసుకుంటానని మంగళవారం పెట్రోల్ బాటిల్‌తో వచ్చి, కార్యాలయానికి తాళం వేశాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని పెండింగ్ కిరాయి చెల్లిస్తానని భరోసా ఇవ్వడంతో సురేందర్ కార్యాలయ తాళాన్ని తీశాడు.

అమరచింత ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేస్తున్న యజమాని సురేందర్

వారంలో 'డీఎస్సీ -08' నియామకపత్రాలు

అర్హుల లెక్కతేల్చిన విద్యాశాఖ

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : 2008 డీఎస్సీలో నష్టపోయిన బాధితులకు ఉద్యోగాలిచ్చేందుకు అర్హులైన వారి లెక్కను పాఠశాల విద్యాశాఖ తేల్చింది. ఎట్టకేలకు 1,399 మంది ఉద్యోగాలు పొందేందుకు అర్హులని గుర్తించింది. వీరికి వారంలో నియామకపత్రాలివ్వాలని నిర్ణయించింది. 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులను కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలవారీగా అభ్యర్థుల జాబితాలను విడుదల చేసి, సెప్టెంబర్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ నెల 9లోపు తుది జాబితాలను రూపొందించేందుకు 9 జిల్లాలకు పరిశీలకులను విద్యాశాఖ నియమించింది. తుది జాబితాలు విద్యాశాఖ డైరెక్టరేట్‌కు చేరాయి. అయితే నియామకపు ఉత్తర్వులిచ్చే అంశంపై ప్రభుత్వం తీవ్రం జాప్యంచేసింది. దీంతో అభ్యర్థులు 19న ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి తమకు ఉద్యోగాలివ్వాలని కోరారు. అధికారులతో మాట్లాడిన ఆయన రెండుమూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారం గడిచినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మళ్లీ ఆగ్రహించిన అభ్యర్థులు మంగళవారం ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో చర్చలు జరిపిన సర్కారు ఎట్టకేలకు ఆందోళనను విరమింపజేసింది. అయినా కొందరు అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు తరలివచ్చి నియామకపత్రాలపై ఆరా తీశారు. ఇదే విషయంపై విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి స్పందిస్తూ వారంలో అభ్యర్థులకు నియామక ఉత్తర్వులిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

మరో వారంపాటు బోధన బంద్

- ఇప్పటికే బడులకు దూరంగా 50వేల మంది సర్కారు టీచర్లు
- టీచర్లకే కుల గణన డాటా ఎంట్రీ బాధ్యతలు
- డిసెంబర్ 4న న్యాస్ సర్వే.. ప్రభావం చూపే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సర్కారు స్కూళ్లల్లో మరో వారం పాటు విద్యాబోధన అటకెక్కనున్నది. కులగణనతోపాటు ఇప్పుడు డాటా ఎంట్రీ బాధ్యతలను కూడా టీచర్లకే అప్పగించారు. దీంతో రాష్ట్రంలోని 50వేల మంది టీచర్లు, హెచ్ఎంలు వారంపాటు బడులకు దూరంగా ఉండనున్నారు. ఇప్పటికే సర్వేతో 20 రోజులపాటు క్లాసులు అరకొరగా జరగగా, మరో వారం పది రోజులపాటు డాటా ఎంట్రీ కోసం క్లాసులు బంద్‌కానున్నాయి. తొలుత సర్వే చేస్తే సరిపోతుందని చెప్పి.. ఇప్పుడు డాటా ఎంట్రీ కూడా చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. జాతీయంగా నిర్వహిస్తున్న కేంద్రం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్)లో 3, 6, 9 తరగతుల్లోని విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. డిసెంబర్ 4న నిర్వహించనున్న ఈ పరీక్ష కోసం విద్యాశాఖ అధికారులు ప్రాక్టీస్ పేపర్లు, మాడల్ పేపర్లను తయారుచేసి విద్యార్థుల చేత ప్రాక్టీస్ చేయిస్తున్నారు. ఈ తరుణంలోనే కుల గణన విధులు వచ్చిపడ్డాయి. దీంతో 18వేల స్కూళ్లలో మూడు వారాలపాటు సగంపూటే క్లాసులు నడిచాయి. ఇప్పుడు డాటా ఎంట్రీ కోసం మరో వారంపాటు మళ్లీ ఒకపూటే నడవనున్నాయి. ఈ ప్రభావం న్యాస్‌పై పడనున్నది.

మినహాయింపునివ్వాలని విద్యాశాఖ విజ్ఞప్తి

డాటా ఎంట్రీ విధుల నుంచి టీచర్లను మినహాయించాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్పీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. డాటా ఎంట్రీ బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించాలని విద్యాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఇటీవలే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు సీఎస్ శాంతికుమారిని కలిసి డాటా ఎంట్రీ విధుల నుంచి టీచర్లను మినహాయించాలని కోరినట్టు తెలిసింది. ఇలా సర్వేకు, డాటా ఎంట్రీకి టీచర్లను వినియోగిస్తే, అంతిమంగా న్యాస్ ఫలితాలపై ప్రభావం పడుతుందని సీఎస్‌కు వివరించినట్టు తెలిసింది. అయితే అటు కుల గణన, ఇటు న్యాస్ సర్వే రెండు ముఖ్యమైనవేకావడంతో సర్కారు ఏదీ తేల్చుకోలేకపోతున్నది.

కాంగ్రెస్ హామీలు అమలుచేయాలి

ఇందిరాపార్కు వద్ద వికలాంగుల ధర్నా

మందకృష్ణ మాదిగ

చిక్కడపల్లి, నవంబర్ 26: సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలు సంవత్సరం గడుస్తున్నా అమలుచేయకపోవడం దారుణమని ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు, వీహెచ్‌పీఎస్ గౌరవ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. రేవంత్‌రెడ్డి అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చాడని మరోసారి రుజువైందని మండిపడ్డారు. వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6000కు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఎంఆర్‌పీఎస్ అండగా ఉన్నదని చెప్పారు. ధర్నాలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, జాతీయ కోర్‌కమిటీ చైర్మన్ గోపాల్ రావు, అందె రాంబాబు, సత్యనారాయణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంగమ్మ, ప్రజా వాగ్గేయకారుడు సోమన్న, అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మాలలు మద్దతివ్వాలి:

వంగపల్లి శ్రీనివాస్

వంగపల్లి శ్రీనివాస్

మహేశ్వరాబాద్, నవంబర్ 26: ఎస్సీ వర్గీకరణకు మాలలు మద్దతు ఇచ్చి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. వర్గీకరణ వ్యతిరేక శక్తులకు అంబేద్కర్ పేరు ఎత్తే అర్హత లేదని పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని వంగపల్లి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులను గౌరవిస్తూ మాలలు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. నాయకులు శ్యామ్‌రావు, వెంకట్, చందు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమమా..? కాంగ్రెస్ పార్టీదా?

- మలక్‌పేట్ భవన్‌లో దివ్యాంగుల ఆలయ్ బలయ్
- పోస్టర్లపై కాంగ్రెస్ నేతల ఫొటోలు
- దివ్యాంగ సంఘాల నేతల ఫైర్

హైదరాబాద్, నవంబర్26 (నమస్తే తెలంగాణ): వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంపై దివ్యాంగ సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ కార్యక్రమమా? ప్రభుత్వ కార్యక్రమమా? అని మండిపడుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సంఘాల నేతలతో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని మలక్‌పేట సంక్షేమభవన్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమ పోస్టర్‌పై సీఎం, మంత్రులతోపాటు కాంగ్రెస్ నేతల ఫొటోలను కూడా ముద్రించడంపై రచ్చ జరుగుతున్నది. ఇదీ పార్టీ కార్యక్రమమా? ప్రభుత్వ కార్యక్రమమా? అని దివ్యాంగ సంఘాల నేతలు నిలదీస్తున్నారు. దీనిపై చైర్మన్‌తోపాటు ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

నటుడు శ్రీతేజ్‌పై చీటింగ్ కేసు

మూసాపేట, నవంబర్ 26: ఓ మహిళను పెండ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో సహజీవనం చేస్తూ రూ.20 లక్షల మేర మోసం చేసిన ఆరోపణపై సినీ నటుడు శ్రీతేజ్‌మీద కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తొలుత గచ్చిబౌలి పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కూకట్‌పల్లి పీఎస్‌కు బదిలీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట ఆంజనేయనగర్‌కు చెందిన శ్రీతేజ్‌కు, మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కారంచేడుకు చెందిన మహిళ(35)తో ఓ కార్యక్రమంలో పరిచయం ఏర్పడింది. అది కాస్త సహజీవనానికి దారి తీసింది. దీనిని ఆసరాగా చేసుకున్న శ్రీతేజ ఆ మహిళ నుంచి రూ.20 లక్షలు తీసుకొని వాడుకున్నాడు. తన డబ్బు తిరిగి ఇవ్వకపోగా, తన పిల్లలను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలోనూ ఓ మహిళ తనను మోసం చేశాడని